భద్రాద్రిలో మైకుల ఏర్పాటు

మైకులను ఏర్పాటు చేస్తున్న ఆలయ సిబ్బంది

భద్రాచలం, సెప్టెంబర్ 26: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారికి ప్రతి నిత్యం జరిగే పూజా కార్యక్రమాలు భక్తులకు వినిపించేలా మైకులు ఏర్పాటు చేసేందుకు ఆలయ ఈవో రమాదేవి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని రామాలయం ప్రాంగణం నుంచి బస్టాండ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు సిబ్బందిచే నూతనంగా మైకులను ఏర్పాటు చేయించే పనులు చేపట్టారు.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సతీష్, ఎస్ఐలు

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 26: అపరిచితుల పట్ల ప్రజలు అప్రమత్తతతో ఉండి పోలీసులకు సమాచారం అందించాలని మణుగూరు సీఐ సతీశ్‌కుమార్ అన్నారు. గురువారం టీఎస్ఎస్పీ సిబ్బందితో కలిసి పగిడేరు ఎస్టీ కాలనీలోని గుత్తికోయ గుంపు గ్రామాన్ని సందర్శించారు. కొత్తవారు ఎవరైనా వచ్చారా అని అడిగి తెలుసుకొని, కొత్త వ్యక్తులు సంచరించినా, ఏ సహాయం కోసం సంప్రదించినా సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రంజిత్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రతిఒక్కరూ దోమతెరలు ఉపయోగించాలి

స్ప్రేయింగ్ పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో చైతన్య

చర్ల, సెప్టెంబర్ 26: మండలంలోని మారుమూల గ్రామాల్లో దోమల నివారణ కోసం చేపట్టిన దోమలమందు పిచికారీ కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లెనిన్ కాలనీలోని ఆదివాసీలతో మాట్లాడారు. విష జ్వరాలు రాకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలు ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శ్రీధర్, సబ్ యూనిట్ ఆఫీసర్ ధర్మారావు, వేణుగోపాలరావు సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో అవగాహన సదస్సు

దుమ్ముగూడెం, సెప్టెంబర్ 26: కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో అవగాహన కలిపించారు. మండల పరిధిలోని అచ్యుతాపురం గంగోలు చెరువు వద్ద తెప్పలు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. భద్రాచలం, బూర్గంపహాడ్, చర్ల, దుమ్ముగూడెం మండలాల తహసీల్దార్లు, ఎంపీవోలు, మండలాల మత్స్య సంఘాల అధ్యక్షులు, సభ్యుల సమక్షంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీవో, ఎంపీవోలు, గిర్దావర్లు, పంచాయతీ కార్యదర్శులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

భద్రాచలం, సెప్టెంబర్ 26: భద్రాచలం పట్టణంలో కొన్నేళ్లుగా అక్రమంగా నిర్మించిన కట్టడాలు, షాపులను గురువారం పంచాయతీ ఆధ్వర్యంలో అధికారులు తొలగించారు. పంచాయతీ ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది జేసీబీ ద్వారా పట్టణంలోని పాత ట్రాఫిక్ పోలీసుస్టేషన్ సమీపంలో అక్రమంగా నిర్మించిన షాపులను, ఇతర బడ్డీ కొట్లను తొలగించారు. 10 షాపులు అక్రమంగా నిర్మించడంతో ఆ షాపుల యజమానులకు పంచాయతీ నుంచి నోటీసులు ఇచ్చి తొలగించామని ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కొత్తల పండుగ

చర్ల, సెప్టెంబర్ 26: ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే పండుగల్లో ఒకటైన కొత్తల పండుగను మండల కేంద్రం చర్లలోని నాగులమ్మ గుడివద్ద గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతియేడాది కొత్త పంటలు కూరగాయలు, రకరకాల ధాన్యం ఇండ్లకు వచ్చిన సందర్భంగా ఆ పంటలను ముందుగా తమ ఇలవేల్పులకు నైవేద్యం పెడతారు. దేవరబాల మానికరావు లక్ష్మి, రాజన్న, పలువురు కొత్తల పండుగ కమిటీ సభ్యులు సంబురాల్లో పాల్గొన్నారు.

ఇల్లెందు ప్రభుత్వాసుపత్రిలో సైనస్ సర్జరీ

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 26: ఇల్లెందు ప్రభుత్వాసుపత్రిలో మొట్టమొదటి సారిగా ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీని వైద్యులు గురువారం విజయవంతంగా చేశారు. ఇల్లెందు స్టేషన్ బస్తీకి చెందిన అబ్దుల్ కలీం, గత కొన్నేళ్లుగా ముక్కుదిబ్బడ, శ్వాసకోశ సమస్యలు, తలనొప్పితో బాధపడుతున్నాడు. ఆయనకు ఈఎన్‌టీ స్పెషలిస్ట్ డాక్టర్ రవిబాబు, తన వైద్య బృందంతో కలిసి ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/S Shriram Finance Ltd, **KOTHAGUDEM** Branch Rep. by its Branch Manager it is stated that one **POREDDY RAVINDER REDDY,** S/o. Veera Reddy, **Aged : 26**Years, **R/o.** H.No.20-4-61/A, Hamali Colony, Palvoncha Town and Mandal, Bhadradri Kothagudem District is creating mortgage against his property shown below as security for the proposed trade Loan. If anybody having any objection they can send the objections to me or to my client within **3** days from the date of publication of this notice and further objections if any shall not bind my client.

SHEDULE OF THE PROPERTY

RCC Building bearing H.No 20-4-61/A (PTIN No. 1108015321) with a plinth area of 585 Sq Feet, in the house site of an extent of 252.16 Sq.yards situated at Hamali Colony, Palvoncha Town and Mandal, Bhadradri Kothagudem District, SRO Limts of Kothagudem, bounded by: **EAST:** House of Deva Karna (H.No.20-4-61), **WEST:** Municipal Road, **NORTH:** House of Gajjala Rambai (H.No.20-4-65), **SOUTH :** House of Rakesh.

PALIVELA GANESH BABU
Advocate, Kothagudem, Bhadradri Kothagudem Dist.,Cell:9849246278
Kothagudem Dt :26.09.2024

పురుగుమందు తాగి విద్యార్థిని ఆత్మహత్య

పినపాక (కరకగూడెం), సెప్టెంబర్ 26: మండలంలోని కలవలనాగారం గ్రామానికి చెందిన కలం అక్షర (17) పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాచలం ఓ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అక్షర కొద్దిరోజుల క్రితం ఇంటికి వచ్చింది. రోజులు గడుస్తున్నా కాలేజీకి వెళ్లకపోవడంతో కాలేజీకి వెళ్లమని తల్లిదండ్రులు మందలించారు. దీంతో క్షణికావేశానికి లోనైన అక్షర పురుగుమందు తాగింది. కుటుంబసభ్యులు వరంగల్ తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

దాదాపుగా 77 ఏళ్ల క్రితం.. నాటి మన తెలంగాణలో...

అన్యాయాలు.. అక్రమాలు..
అణచివేతలు.. అఘాయిత్యాలు
దోపిడీలు.. దౌర్జన్యాలు..

ఇవన్నీ మితిమీరినప్పుడు..
వీటిని భరించలేనప్పుడు..
అధైర్యం ఆవహించినప్పుడు..

అదిగదిగో అక్కడెక్కడో..
గొంతు ఉరిమింది..
కొడవలి పదునెక్కింది..

దోపిడీగాళ్లు బేజార్..!
గూండాగాళ్లు పరార్..!!
బాధితులంతా హుషార్..!!!

ఆ గొంతు- 'ఐలమ్మ'ది..!
ఆ కొడవలి- 'ఐలమ్మ'ది..!!
ఆ వీరత్వం- 'ఐలమ్మ'ది..!!!

ఐలమ్మకు జై

నైజాం పాలనలో రజాకార్ల దురాగతాలకు వ్యతిరేకంగా మొదలైన తెలంగాణ రైతాంగ ఆందోళన.. క్రమక్రమేణా సాయుధ పోరాటంగా మారింది. బాధితులైన సామాన్య నిరుపేద రైతులు, ఇతరులు తుపాకులు పట్టారు. చావడమో–చంపడమో–నంటూ కదన రంగంలోకి దుమికారు. వీరిని ఇలా పోరాటోన్ముఖులను చేసిన చైతన్యశీలి ఐలమ్మ.

అది ఎలా జరిగిందంటే..

ఒకానొక రోజున, ఐలమ్మ కష్టార్జితమైన పంటను దోచుకుని తీసుకెళ్లేందుకు భూస్వాములు పంపిన గూండాగాళ్లు వచ్చారు. వాళ్లకు ఐలమ్మ ఏమాత్రం భయపడలేదు. తన చేతిలోని పదునైన కొడవలిని పైకెత్తి, కళ్లల్లో నిప్పులు కురిపిస్తూ.. ఉరుములా గర్జిస్తూ.. పులిలా గాండ్రిస్తూ ముందుకు కదలింది. ఆ సామాన్యురాలి నుంచి అసామాన్యమైన ఈ ప్రతిఘటనను ఏమాత్రం ఊహించలేని ఆ గూండాగాళ్లు బిత్తరపోయారు, అక్కడి నుంచి పరారయ్యారు. వారిని ఉసిగొల్పిన దోపిడీగాళ్లు (భూస్వాములు).. ఈ అనుభవంతో బేజారెత్తారు. ఈ విషయం తెలుసుకున్న బాధిత ప్రజలంతా ఉత్సాహభరితులయ్యారు. ఐలమ్మ వీరత్వంతో చైతన్యవంతులయ్యారు. ఆమె బాటలోనే ఎక్కడి కక్కడ భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా తిరుగుబాటుకు దిగారు. ఇది క్రమ క్రమేణా సాయుధ పోరాటంగా మారింది. ఐలమ్మ కొడవలి ఎత్తితే.. వీరంతా తుపాకులు ఎత్తారు. ఇలా, తెలంగాణ ఉద్యమానికి,

ఇల్లెందు రూరల్: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు దిండిగాల

తెలంగాణ చైతన్యానికి, తెలంగాణా వీరత్వానికి ఐలమ్మ.. ఓ ఐకాన్(చిహ్నం)గా మారింది. నాటి నుంచి నేటి వరకు యావత్ తెలంగాణ ప్రజల జేజేలు అందుకుంటూనే ఉంది.. అందుకుంటూనే ఉంటుంది.

జిల్లావ్యాప్తంగా జయంతి వేడుకలు

వీరనారి ఐలమ్మ జయంతి వేడుకలను జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ అధికారులు, నాయకులు, ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మణుగూరులోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, ఇల్లెందులో తెలంగాణ ఉద్యమకారుడు దిండిగాల రాజేందర్, ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. – నమస్తే నెట్‌వర్క్

పాల్వంచ: మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు..

సారపాక : ఎంపీడీవో కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో ఎంపీడీవో, కార్యాలయ సిబ్బంది

ఇల్లెందు రూరల్: మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి..

పాల్వంచరూరల్ : ఎంపిడీవో కార్యాలయంలో..

దమ్మపేట : చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీడీవో రవీంద్ర రెడ్డి

ఇల్లెందు రూరల్: నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై.చిన్నప్పయ్య

అన్నపురెడ్డిపల్లి: రెవెన్యూ సిబ్బంది..

అశ్వారావుపేట టౌన్: రజక సంఘం నాయకులు..

పినపాక : మండల పరిషత్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

దుమ్ముగూడెం : చాకలి ఐలమ్మ చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి

కరకగూడెం తహసీల్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

'భద్రాద్రి' సరిహద్దుల్లో మావోల అలజడి!

- సీఆర్‌పీఎఫ్ బేస్‌క్యాంపుపై రాకెట్ లాంచర్ల దాడి
- ఇరువర్గాల మధ్య మూడుసార్లు కాల్పులు!

కొత్తగూడెం క్లైం, సెప్టెంబర్ 26: ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న మావోయిస్టులు సరి'హద్దు'లు దాటి దాడికి తెగబడ్డారు. సీఆర్‌పీఎఫ్ బేస్‌క్యాంపుపై రాకెట్ లాంచర్లతో దాడికి పాల్పడ్డారు. అప్రమత్తమైన జవాన్లకు, మావోయిస్టులకు మధ్య మూడుసార్లు కాల్పులు జరిగినట్లు తెలుస్తోంది. వివరాలిలా ఉన్నాయి.. ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం కేంద్రంగా పావులు కదుపుతున్న మావోయిస్టు పార్టీ.. తెలంగాణలోకి చొరబడేందుకు వ్యూహాలు రచిస్తోంది. ఈ క్రమంలోనే భద్రాద్రి కొత్తగూడెం – సుక్మా జిల్లాల శివారులో ఉన్న చర్ల మండలంలోని పూసుగుప్ప శివారులోని సీఆర్‌పీఎఫ్ 81వ బెటాలియన్‌కు చెందిన బేస్‌క్యాంపుపై బుధవారం సాయంత్రం రాకెట్ లాంచర్లతో మెరుపుదాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. దీంతో వెంటనే అప్రమత్తమైన జవాన్లు.. కాసేపటికి తేరుకుని మావోయిస్టులపై ఎదురుకాల్పులు జరిపారు. ఇరువర్గాల మధ్య మూడుసార్లు కాల్పుల జరిగినట్లు తెలుస్తోంది. ఇంతకాలం ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల నుంచి ఉనికిని చాటుకున్న మావోయిస్టులు ఇప్పుడు నేరుగా తెలంగాణలోకి చొచ్చుకొచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, తెలంగాణలోకి యాక్షన్ టీమ్‌లు చొరబడి విధ్వంసాలు సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు ఇక్కడి పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రస్తుతం చోటుచేసుకున్న కాల్పుల ఘటనతో సరిహద్దుల్లో పోలీస్ అధికారులు హైఅలెర్ట్ ప్రకటించినట్లు సమాచారం. కాగా, ఈ ఘటనపై ఇప్పటి వరకు పోలీస్ అధికారులు ఎలాంటి వివరాలను ధ్రువపర్చలేదు.

దళిత బిడ్డను హతమార్చినందుకా వారోత్సవాలు?

మావోయిస్టుల వారోత్సవాలు ఎవరి కోసం? ఆ పార్టీ 20 ఏళ్ల సంబరాలు ఎందుకోసం? ఆదివాసీ, దళిత బిడ్డల బతుకు ఛిద్రం చేసినందుకా? అంటూ మావోయిస్టులకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆదివాసీ హక్కుల సంఘం పేరుతో గురువారం విడుదలైన కరపత్రం కలకలం సృష్టిస్తుంది. 20 ఏళ్లలో తమ ఆదివాసీ, దళిత బిడ్డల బతుకులు ఛిద్రం చేసి, చదువులు, ఉద్యోగాలు, ఉపాధికి దూరం చేసి ప్రభుత్వం కల్పిస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందకుండా చేసినందుకు మావోయిస్టు పార్టీ సంబురాలు చేసుకుంటున్నదని ఆరోపించారు. ఆ పార్టీ మాయదారి మాటలు, పాటలను నమ్మి పార్టీలో చేరిన సుమారు 5,500 మంది ఆదివాసీ, దళిత బిడ్డలు ప్రాణాలు పోగొట్టుకున్నందుకు నాయకులు సంబురాలు చేసుకుంటున్నారా? అని ప్రశ్నలు సంధించారు. హక్కుల సంఘం పేరుతో నిజ నిర్ధారణ చేస్తామంటూ బయలుదేరిన నాయకులు మావోయిస్టు పార్టీకి చెందిన దళి బిడ్డ నీల్సోను పోలీస్ ఇన్ఫార్మర్ పేరుతో హత్య చేస్తే ఇప్పటివరకు ఎందకు స్పందించలేదని ప్రశ్నించారు. ప్రజాస్వామిక విప్లవం, సమసమాజ నిర్మాణమంటూ మావోయిస్టులు పగటి కలలు కంటూ తమ జీవితాలు, తమ బిడ్డల భవిష్యత్‌ని నాశనం చేస్తున్నారంటూ కరపత్రంలో ఘాటు వ్యాఖ్యలు చేశారు.

సంక్షిప్తం

గంజాయి స్వాధీనం

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 26: గంజాయి కొనుగోలు చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపిన వివరాలు.. ఇల్లెందు నంబర్–2 బస్తీకి చెందిన పానుగంటి సురేష్, మండలంలోని రాగబోయినగూడెం గ్రామస్తులు వెంకటరమణ, శివకృష్ణ నుంచి గంజాయి కొన్నాడు. దానిని తన ఇంటిలో ఉంచాడు. ఈ సమాచారంతో పోలీసులు గురువారం జాగిలాలతో తనిఖీ చేశారు. సురేష్ ఇంటి నుంచి 600 గ్రాముల గంజాయిని స్వాధీనపర్చుకున్నారు. సురేష్‌పై కేసు నమోదు చేశారు.

పొట్టి శ్రీరాములు పేరు మార్చొద్దు

అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 26: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పు నిర్ణయాన్ని ఆర్యవైశ్య సంఘం నాయకులు ఖండించారు. ఈ నిర్ణయాన్ని నిరసిస్తూ గురువారం స్థానిక ప్రధాన సెంటర్‌లో ఆందోళనకు దిగారు. నాయకులు వనమా గాంధీ, జంగాల శ్రీనివాసరావు, దోసపాటి రాంబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గోశాల సందర్శన

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబర్ 26: మండలంలోని వినాయకపురం గ్రామంలో శ్రీచిలకలగండి ముత్యాలమ్మ ఆలయ ఆవరణలోగల కామధేను గోశాలను గురువారం అశ్వారావుపేట లయన్స్ క్లబ్ బృందం సందర్శించింది. గోశాల అభివృద్ధికి సహకరిస్తామని నిర్వాహకులతో చెప్పారు. క్లబ్ బాధ్యులు దూబగుంట్ల దుర్గారావు, యూఎస్ ప్రకాశరావు, కోటగిరి సీతారామస్వామి, కొఠారి చలపతిరావు, కోటగిరి మోహనరావు, బిర్రం వెంకటేశ్వరరావు, నల్లపు లీలాప్రసాద్, తమిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోషణ మాసోత్సవం

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబర్ 26: మండలంలోని నారాయణపురం కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసోత్సవాన్ని ఐసీడీఎస్ అధికారులు నిర్వహించారు. మొబైల్ టీం డాక్టర్ షామిలి, సూపర్‌వైజర్ పద్మావతి, గుమ్మడవల్లి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ భాస్కర్, టీచర్లు సుందరి, సావిత్రి, రాణి, రాధ, వెంకాయమ్మ, వెంకమ్మ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ కమిటీ ఎన్నిక

అశ్వారావుపేట, సెప్టెంబర్ 26: పీఆర్‌టీయూ మండల కమిటీని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అధ్యక్షుడిగా ఆర్.రాంప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలిగా సిహెచ్.శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు, కార్యదర్శిగా హరికుమార్, మహిళా కార్యదర్శిగా డి.లీలావతి, గౌరవాధ్యక్షుడిగా బి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

'పేట' ఎంఈవోగా ప్రసాదరావు

అశ్వారావుపేట, సెప్టెంబర్ 26: మండలంలోని మామిళ్ళవారిగూడెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావును ఎంఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన గురువారం విధుల్లో చేరారు.

గీత కార్మికులకు శిక్షణ

అశ్వారావుపేట టౌన్, సెప్టెంబర్ 26: స్థానిక కాళింగుల బజారులోగల గోకుల బంధంలో 26 మంది గీత కార్మికులకు యంత్ర సాయంతో చెట్లు ఎక్కడంపై శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా బీసీ సంక్షేమాధికారి విజయలక్ష్మి, ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వరావు, నిపుణులు అల్లూరి కోటయ్య, గొనగంటి కృష్ణ, కోటయ్య పాల్గొన్నారు.

దమ్మపేటలో వర్షం

దమ్మపేట, సెప్టెంబర్ 26: దమ్మపేట మండలంలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం కురిసింది. వ్యాపారులు ఇబ్బందిపడ్డారు.

రేషన్ బియ్యం పట్టివేత

పాల్వంచ, సెప్టెంబర్ 26: మహబూబాబాద్ నుంచి ఒడిశా రాష్ట్రానికి తరలిస్తున్న 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ సుంకరి శ్రీనివాసరావు గురువారం తెల్లవారుఝామున పాల్వంచలో పట్టుకున్నారు. బియ్యం సహద వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత, బియ్యాన్ని స్వాధీనపర్చుకుని పాల్వంచలోని జీసీసీ ప్రజాపంపిణీ గోడౌన్‌కు తరలించారు. కేసు నమోదైంది.

సింగరేణి డైరెక్టర్ పదవీకాలం పొడిగింపు

కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 26: సింగరేణి ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణరావు పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. ఆయన పదవీకాలాన్ని మరో ఏడాది వరకు పొడిగిస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు.

'వ్యర్థంతో అర్థం' ఎగ్జిబిషన్

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 26: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయంలో 'వ్యర్థంతో అర్థం' (వేస్ట్ టు ఆర్ట్) ఎగ్జిబిషన్ గురువారం ఏర్పాటైంది. వీటిని విద్యార్థులు తమ ఇళ్ల వద్ద పొడి చెత్తతో తయారు చేశారు.

సోలార్ కార్మికుల ధర్నా

ధర్నా చేస్తున్న సోలార్ కార్మికులు

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 26: సోలార్ పవర్ ప్లాంట్ నుంచి తొలగించిన సెక్యూరిటీ గార్డులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకుడు అబ్దుల్ నబి డిమాండ్ చేశారు. తొలగించబడిన కార్మికులు గురువారం జీఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నబి మాట్లాడుతూ.. తొలగించిన ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లుకు నాయకులు వినతిపత్రం ఇచ్చారు.

కొనసాగుతున్న 'ప్రశస్థ' శిక్షణ

అశ్వారావుపేట, సెప్టెంబర్ 26: ప్రశస్థ యాప్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం కొనసాగుతున్నది. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఐఈఆర్‌పీలు రామారావు, లక్ష్మి, ఎంఈవో పి.ప్రసాదరావు శిక్షణ ఇచ్చారు.

టేకులపల్లి, సెప్టెంబర్ 26: మండలంలోని సులానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం రెండోరోజు శిక్షణ కార్యక్రమం కొనసాగింది. ఎంఈవో జగన్, ఐఈఆర్‌పీలు నీరజ, షారోని, రవీందర్, సారయ్య, హెచ్ఎం దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

చుంచుపల్లి, సెప్టెంబర్ 26: స్థానిక బాబూక్యాంప్ స్కూల్‌లో 275 మందికి గురువారం కూడా శిక్షణ కొనసాగింది. కో–ఆర్డినేటర్ సైదులు, నోడల్ అధికారి బాలాజీ, బాబూక్యాంప్ హెచ్ఎం నీరజ, ఆర్‌పీలు సిద్ధయ్య, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట రూరల్, సెప్టెంబర్ 26: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం శిక్షణ ప్రారంభమైంది. ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు కనకదుర్గ, నాగలక్ష్మి శిక్షణ ఇచ్చారు. ఎంఈవో కీసరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 25: మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు కోర్స్ డైరెక్టర్ ఎల్.రాంబాబు శిక్షణ ఇచ్చారు. ఎంఈవో స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఆళ్ళపల్లి ముస్లిం సోదరులు

ఆళ్ళపల్లి, సెప్టెంబర్ 26: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న జాకారం ప్రధానోపాధ్యాయుడు షేక్ మహమూద్ పాషాను ఆళ్ళపల్లి ముస్లిం సోదరులు మండల కేంద్రంలో గురువారం పట్టు శాలువతో పుష్పగుచ్చాలతో సన్మానించారు. కార్యక్రమంలో నయిమ్, అతహార్, ఖలీద్, సయ్యద్, సాబీర్, ముజహార్, అప్రోజ్, సయ్యద్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాల దేవాలయంలో మాస కల్యాణం

ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పర్ణశాల, సెప్టెంబర్ 26: పర్ణశాల దేవాలయంలో గురువారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని మాస కల్యాణం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 10.30 గంటల సమయంలో స్వామివారికి కల్యాణం, ముందుగా విశ్వక్సేన పూజ పుణ్యాహవచనం, యాత్రధారణ, కంకణ ధారణ, యజ్ఞోపవీత ధారణ, స్వామివారి ప్రవర్లు మహాసంకల్పం, మంగళాష్టకాలు, మధుపర్కాలు, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ వేదాశీర్వచనం, మంగళహారతి, విశేష ప్రసాద వితరణ తదితర పూజలు జరిగాయి. ఆలయ ఇన్‌చార్జి అనీల్‌కుమార్, ముఖ్య అర్చకులు శేషం కిరణ్‌కుమార్ ఆచార్యులు, భార్గవాచార్యులు పాల్గొన్నారు.

ఎల్ ఎల్ బీ విద్యార్థినికి ఐటీడీఏ ఆర్థిక సాయం

విద్యార్థినికి ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ అందిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, సెప్టెంబర్ 26: లాసెట్ ఎంట్రన్స్ రాసి అత్యుత్తమ ర్యాంకుతో ఎల్ఎల్‌బీ సీటు సాధించిన విద్యార్థినికి ఐటీడీఏ పీవో రాహుల్ తన చాంబర్‌లో రూ.36 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దమ్మపేట మండలం జగ్గారం గ్రామానికి చెందిన మడివి డయానా ఎల్ఎల్‌బీ లాసెట్ ఎంట్రన్స్‌లో 3500 ర్యాంకు సాధించి హైదరాబాద్ మహాత్మా గాంధీ లా కళాశాలలో సీటు సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుంచి ప్రోత్సాహకంగా ఈ చెక్కు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజ్, తల్లి సుజాత, కల్యాణ్‌లు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయం

సారపాక, సెప్టెంబర్